పైగామ్ ఎ హిదాయత్

సంపుటి: 5 సంచిక: 12 డిసెంబర్ 2017 వెల: 20/-

పర్యవేక్షకులు

మౌలానా ముహమ్మద్ అబ్దుల్ ఖవీ

సంపాదకులు

ముహమ్మద్ ఉమర్ ఫారూఖ్

మీ సలహాలు, సందేహాలు, ఫిర్యాదుల కొరకు సంప్రదించండి

Editor, Paigham e Hidayath,
17-1-391/2/79/A,
Khaja Bagh Colony,
Saidabad, Hyderabad - 500059.
Phone: 9030557865

బ్యాంక్ ఎకౌంట్ వివరాలు

Ac. no:035210011034204
MOHD ABDUL QAVI,
ANDHRA BANK,
MALAKPET BRANCH
IFSC Code: ANDB0000352

paighamehidayath.tk

విషయ సూచిక: | ఫెహ్రిస్తే మజామీన్:

ఖుర్ఆన్ సందేశం:

సూర ఎ నూర్ 5

హదీస్ సందేశం:

వినయవినమ్రతలు – గర్వాహంకారాలు 9

ఆదర్శమూర్తి (స):

ఇస్లాంకు వ్యతిరేకంగా కుట్రల ఆరంభం 13

ఫిఖా:

వజూ ఏ సందర్భాలలో అభిలషనీయము? 16

ప్రత్యేక వ్యాసాలు

షిర్క్ – ఓ క్షమించరాని నేరం 20

దర్సే ఖుర్ఆన్:

సూర ఎ నూర్ 24

దర్సే హదీస్:

తవాజు వ ఖాక్సారీ – గురూరో తకబ్బుర్ 28

దర్సే సీరత్:

ఇస్లామ్ కే ఖిలాఫ్ సాజిషో కా ఆగాజ్ 32

దర్సే ఫిఖ్:

వజూ కిన్ హాలాత్ మే ముస్తహబ్ హై? 35

ఖుసూసీ మజామీన్

షిర్క్ – నాకాబిలే మాఫ్ గునాహ్ 39

ఖుసూసీ మజ్మూన్

పడోసియోం కా హఖ్ అదా కీజియే 42

పత్రికలో రచయితలు వ్యక్తం చేసే అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

بسم الله الرحمن الرحيم

యా అయ్యుహల్లజీన ఆమనూ లాతద్ఖులూ బుయూతన్ గైర బుయూతికుమ్ హత్తా తస్తానిసూ వ తుసల్లిమూ అలా అహ్లిహా జాలిక ఖైరుల్లకుమ్ లఅల్లకుమ్ తజక్కరూన్

ఓ విశ్వాసులారా ! మీరు మీ ఇళ్లల్లోకి తప్ప ఇతరుల ఇళ్లలోకి వారి అనుమతి పొందనంతవరకు, అక్కడున్న వారికి సలామ్ చేయనంతవరకు ప్రవేశించకండి. ఇదే మీ కొరకు మేలైన పద్ధతి. మీరు గుర్తుంచుకునేందుకుగాను (ఈ విధంగా బోధపరచబడింది).

ఫఇల్లమ్ తజిదూ ఫీహా అహదన్ ఫలా తద్ఖులూహా హత్తా యుఅ్జన లకుమ్ వ ఇన్ కీల లకుమిర్జిఊ ఫర్జిఊ హువ అజ్కా లకుమ్ వల్లాహు బిమా తఅ్మలూన అలీమ్

మరి మీకు అక్కడ ఎవరూ కనిపించకపోతే (అప్పటికీ) అనుమతి లేకుండా లోనికి ప్రవేశించకండి. తిరిగి వెళ్ళిపొమ్మని ఒకవేళ మీతో అనబడితే, మీరు (సంస్కారవంతుల్లా) తిరిగి వెళ్ళిపోండి. అదే మీ కొరకు ఎంతో పవిత్రమైనది. మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు సుమా !

లైస అలైకుమ్ జునాహున్ అన్ తద్ఖులూ బుయూతన్ గైర మస్కూనతిన్ ఫీహా మతాఉల్లకుమ్ వల్లాహు యఅ్లము మా తుబ్దూన వమా తక్తుమూన్

అయితే ఎవరూ నివసించని ఇండ్లలో, మీకు చెందిన ప్రయోజనకరమైన వస్తు సామాగ్రి ఏదన్నా ఉన్నప్పుడు మీరు వాటిలోకి ప్రవేశిస్తే అందులో తప్పు లేదు. మీరు బహిర్గతం చేసేదీ, గోప్యంగా ఉంచేది అంతా అల్లాహ్‌కు తెలుసు.

సూర ఎ నూర్ ఆరంభము నుండే నిర్లజ్జ, అశ్లీలతను నియంత్రించడానికి, సమాజము నుండి పూర్తిగా నిర్మూలించడానికి అశ్లీల కార్యాలకు పాల్పడేవారికి ఎలాంటి శిక్షలు విధించాలో వాటిని ప్రస్తావించడం జరిగింది. అలాగే ఎటువంటి ఆధారాలు లేకుండా ఇతరులపై అపనిందలు మోపడాన్ని ఖండిస్తూ దాని నీచత్వాన్ని ప్రస్తావించడం జరిగింది. ఆ తరువాత నిర్లజ్జ, అశ్లీలత లాంటి నీచ కార్యాల నియంత్రణ మరియు సమాజంలో సౌశీల్యత, పవిత్రత పెంపొందే విధంగా కొన్ని ఆదేశాలు ఇవ్వడం జరిగింది. వాటిపై అమలు చేయడం ద్వారా అశ్లీలత వ్యాపించేందుకు ఆస్కారమే ఉండదు. ఆ ఆదేశాలలో ఒకటి "ఇస్తిజాన్" (అనుమతి కోరడం). అనుమతి లేకుండా ఇతరుల ఇండ్లలో ప్రవేశించడం నిషేధించబడింది. విచ్చలవిడిగా స్త్రీ పురుషులు కలసిపోరాదన్నది దీని ముఖ్యోద్దేశం. ఈ కలివిడితనమే నీతిబాహ్యతకు సోపానం అవుతుంది. పై వచనములో పలు రకాల ఇళ్ళ గురించి పలు ఆదేశాలు ఇవ్వబడ్డాయి.

ఇళ్ళు నాలుగు రకాలు. ఒకటి స్వయంగా తాను మాత్రమే నివసించే ఇల్లు. అంటే అందులో అతను తప్ప ఇంకెవ్వరూ ఉండరు. రెండవది అతనితోపాటు ఇతరులు కూడా ఉండేటటువంటి ఇల్లు. వారు స్వయంగా తమ భార్యా పిల్లలే అయినా లేక ఇంకెవరైనా. మూడవది ఇతరుల ఇళ్ళు. అందులో ఇప్పుడు ఎవరైనా ఉండొచ్చు–ఉండకపోవచ్చు. అంటే కచ్చితంగా లోపల ఎవరున్నారో లేరో తెలియదు. నాల్గవది ప్రత్యేకించి ఎవరో ఒకరు ఉండడానికి నిర్మించబడినది కాదు. ఉదా: మస్జిద్, మదరసా, ఖాన్‌ఖా మొదలగు... ఇవి అందరి కోసం కట్టించబడినవి.

వీటిలో మొదటి రకమైన ఇళ్ళ గురించి ప్రస్తావించనఖ్ఖరలేదు. ఎందుకంటే అందులో తాను మాత్రమే నివసిస్తాడు కాబట్టి, ప్రవేశించడానికి ఎవరినీ అనుమతి కోరనఖ్ఖరలేదు. ఇక మిగిలిన మూడు రకాల ఇళ్ళ గురించి పై వచనములలో ప్రస్తావిస్తూ ఈ విధంగా ఆదేశించబడింది:

"ఓ విశ్వాసులారా మీరు (స్వతహాగా నివసించే) మీ ఇళ్ళు కాకుండా ఇతరుల ఇళ్ళలో (వేటిలోనైతే ఇతరులు నివసిస్తుంటారో, అవి వారి సొంత ఇళ్ళయినా అద్దికి ఉంటున్నా) వారి అనుమతి కోరనిదే (అలాగే అనుమతి కోరక ముందు) వారికి సలామ్ చేయనిదే వాటిలోకి ప్రవేశించకండి. (అనగా ముందు బయట నుండి సలామ్ చేసి ఆ తరువాత ఇంట్లో ప్రవేశించడానికి అనుమతిని కోరి, అనుమతి లభించాక లోపలికి ప్రవేశించాలి. కొంత మంది ఇలా అనుమతి కోరడం వారి హోదా కు తగినది కాదని భావించినా) ఈ విధానమే మీ కొరకు మేలైనది. మీరు దీన్ని దృష్టిలో ఉంచుకోవాలని (దీనిపై అమలు చేయాలని ఈ విషయం మీకు తెలుపడం జరుగుతోంది). (ఇది రెండవ రకము ఇళ్ళకు సంబంధించిన ఆదేశము.) ఇక అందులో మీకు ఎవరూ లభించనట్లయితే (వాస్తవానికి అందులో ఎవరైనా ఉన్నా లేకున్నా) మీరు అనుమతి పొందనంత వరకు అందులో ప్రవేశించకండి. (ఎందుకంటే మీకు సమాధానము ఇవ్వకపోయినా అందులో ఎవరైనా ఉండొచ్చు, లేదా నిజంగానే అందులో ఎవరూ ఉండకపోవచ్చు. మరి ఎవరూ లేని సమయంలో ఒకరి ఇంట్లో అనుమతి లేకుండా చొరబడడం సమంజసము కాదు కూడాను. కాబట్టి అనుమతి లభించకపోతే వెన్నక్కి వెళ్ళిపోండి. కాని అనుమతి లేకుండా ప్రవేశించకండి. ఇది మూడవ రకానికి సంబంధించిన ఆదేశము) ఒకవేళ (అనుమతి కోరగా, ఏదైనా కారణం వల్ల ప్రస్తుతం) వెళ్ళిపోండి అని మీతో అనబడితే మీరు తిరిగి వచ్చేయండి. ఇదే మీ కొరకు సబబు. (ఎందుకంటే, అనుమతి ఇవ్వకపోతారా అని లేక బైటికి రాకపోరా అని అక్కడే ఉండడం ఇది ముందుగా తన పరువు తాను పోగొట్టుకోవడం మరియు అనవసరంగా ఒక సోదరుడికి ఇబ్బంది కల్గించడం. ఇది ఇస్లాంలో హరామ్. అలాగే అనుమతి కోరినప్పుడు లోపలి నుండి ఎటువంటి సమాధానము రాకపోతే అప్పుడు కూడా తిరిగి వెళ్ళిపోవాలి. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి హదీసు ఆధారంగా మూడు సార్లు అనుమతి కోరాలి. ఎందుకంటే ఇంట్లోవాళ్ళు ఏదైనా పనిలో నిమగ్నమై ఉండడం వల్ల వినబడకపోవచ్చు. కాని మూడు సార్లు పిలిచిన తరువాత కూడా ఎటువంటి సమాధానము రాకపోతే తిరిగి వెళ్ళిపోవాలి.) మరియు అల్లాహ్‌కు మీ సమస్త కార్యాల సమాచారము ఉంది. (కాబట్టి ఆజ్ఞ ఉల్లంఘించకండి, లేకపోతే శిక్షకు గురవుతారు.) మరియు ఎవరూ నివాసముండని ప్రదేశాలలో వేటిలోనయితే మీ

అవసరము ముడివడి ఉందో, వాటిలో అవసరార్ధము (అనుమతి కోరకుండా) ప్రవేశించడంలో ఎటువంటి పాపము లేదు. (అంటే అందరి సౌలభ్యంకోసం నిర్మించబడిన ఈ గృహాలలో ప్రవేశించడానికి ప్రత్యేకించి ఎవరి అనుమతి కోరనక్కరలేదు. కాబట్టి మీకు గనక అందులో ఏదైనా పని ఉంటే మీరు ప్రవేశించి మీ పని చూసుకోవచ్చు.) మరి మీరు ఏదైతే బహిరంగంగా చేస్తుంటారో లేదా గోప్యంగా చేస్తుంటారో అల్లాహ్‌కు అన్నీ తెలుసు. (కాబట్టి ఎక్కడ ఉన్నా దైవ భీతితో మెలగండి).

బాధాకరమైన విషయం ఏమిటంటే ఇస్లామ్ ధర్మము ఈ విషయానికి ఎంతగా ప్రముఖ్యత నిచ్చిందంటే దివ్య ఖుర్‌ఆన్‌లో దీనికి సంబంధించి ఎంతో విరంగా, విపులంగా అదేశాలు అవతరించి, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు తమ బోధనల, ఆచరణల ద్వారా ఎన్నో సంధర్భాలలో దీని గురించి ఎంతో తాకీదు చేశారు. కాని వారు ఎంత తాకీదు చేశారో ఈ రోజు ముస్లింలు దాన్ని అంతే విస్మరిస్తున్నారు. చదువు సంధ్యలు గల విజ్ఞులు కూడా అనుమతి లేకుండా విచ్చలవిడిగా ఇండ్లలోకి ప్రవేశించడాన్ని పాపముగా భావించడం లేదు, దీనిపై అమలు చేయాలన్న భావన కూడా వారికి కలగడం లేదు. ముస్లిమేతరులు దీనిపై అమలు చేస్తూ వారి సమాజాన్ని చక్కబెట్టుకుంటున్నారు కాని ముస్లింలే దీనిపై ఆచరించడంలో అందరికంటే వెనుకబడి ఉన్నారు. ఇస్లామీయ ఆదేశాలన్నింటిలో వెొట్టవెొదట ఈ ఆదేశముపై అమలు చేయడంలోనే బద్దకముతో వ్యవహరించడం జరిగింది. ఏమైనప్పటికి విచ్చలవిడిగా ఇండ్లలో ప్రవేశించకుండా అనుమతి కోరి సంస్కారవంతుల్లా వ్యవహరించడం ఇది ఖుర్‌ఆన్‌లో ఇవ్వబడిన అనివార్య ఆదేశము, విధి. ఈ విషయంలో బద్దకంతో వ్యవహరించడాన్ని ఖుర్‌ఆన్‌ను తిరస్కరించడంతో అభివర్ణించారు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి ప్రియ అనుచరులు హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్నె అబ్బాస్ రజియల్లాహు అన్హు వారు.

"ఇస్తీజాన్" కు సంబంధించి కొన్ని ముఖ్య విషయాలు:

1. ఈ ఆదేశము స్త్రీ, పరురుషులు ఇద్దరికీ ఇవ్వబడింది. కేవలం పురుషులకు మాత్రమేనని భ్రమించరాదు. హజ్రత్ ఉమ్మె అయాస్ కథనం ప్రకారం వారు నలుగురు స్త్రీలు కలిసి ఎక్కువగా హజ్రత్ ఆయిషా సిద్దీఖా రజియల్లాహు అన్‌హా వారి వద్దకు (ధార్మిక జ్ఞానము నేర్చుకునేందుకు) ఎక్కువగా వెళ్ళేవారు. కాని హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్‌హా వారి అనుమతి ఇస్తేనే ఇంటో ప్రవేశించేవారు. (ఇబ్నె కసీర్)

2. కన్న తల్లి, సొంత అక్క/చెల్లి ఇలా మహ్‌రమ్ (రక్త సంబంధికుల) ఇంట్లో ప్రవేశించేటప్పుడు కూడా అనుమతి కోరి ఆ తరువాతే ప్రవేశించాలి. హజ్రత్ అతా ఇబ్నె యసార్ గారి ఉల్లేఖనం ప్రకారం ఒక వ్యక్తి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారిని ఈ విధంగా ప్రశ్నించాడు: "ఓ దైవ ప్రవక్తా ! నేను నా తల్లి వద్దకు వెళ్ళినప్పుడు కూడా అనుమతి కోరి ప్రవేశించాలా?" దానికి వారు 'అవును అనుమతి కోరాలి' అని అన్నారు. అప్పుడు ఆ వ్యక్తి ఇలా అన్నాడు: "ఓ దైవ ప్రవక్తా ! నేను నా తల్లితోపాటే నివసిస్తున్నాను." అప్పుడు ప్రవక్త గారు "అయినా సరే అనుమతి లభించనిదే ప్రవేశించకు" అని అన్నారు. ఆ వ్యక్తి మళ్ళీ ఇలా అన్నాడు: " ఓ దైవ ప్రవక్తా ! నేను ఎప్పుడూ ఆమె సేవలోనే ఉంటాను." అప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు "అయినప్పటికీ

అనుమతి తీసుకోనిదే ప్రవేశించకు. నీ తల్లిని చూడరాని స్థితిలో చూడడాన్ని నీవు ఇష్టపడతావా? లేదు కదా. మరి అందుకే ఎప్పుడు ఆమె గదిలోకి వెళ్ళినా అనుమతి కోరి వెళ్ళు" అని అన్నారు.

3. ఏ ఇంట్లోనైతే తన అర్ధాంగిని తప్ప మరెవరూ ఉండరో అక్కడ ప్రవేశించడానికి అనుమతి కోరడం భర్త పై విధి కాకపోయినా ముస్తహమ్ మరియు సున్నత్ విధానము ఏమిటంటే అకస్మాత్తుగా ఇంట్లోకి ప్రవేశించకుండా కాలి లేదా నోటి శబ్దం ద్వారా తాను ఇంట్లో ప్రవేశిస్తునట్లు సైగ చేయాలి. హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్నె మస్ఊద్ రజియల్లాహు అన్హు వారి సతీమణి ఉల్లేఖనం ప్రకారం హజ్రత్ ఇబ్నె మస్ఊద్ రజియల్లాహు అన్హు గారు ఇంటో ప్రవేశించేటప్పుడు వారు మమల్ని అఇష్టకరమైన స్థితిలో చూడకూడదని ముందు నోటి శబ్దముతో సైగ చేసి తాను వస్తున్నట్లు తెలిపేవారు.

4. ఇంట్లోకి ప్రవేశించేటప్పుడు ముందు సలామ్ చేయాలి ఆ తరువాతే అనుమతి కోరాలి. ఇమామ్ బుఖారీ రహ్మ గారు "అల్ అదబుల్ ముఫ్రద్" లో హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు అన్హు వారి ఉల్లేఖనాన్ని వ్రాశారు. వారు ఇలా అన్నారు: ఏ వ్యక్తి అయితే సలామ్ చేయకుండా ముందు ఇంట్లోకి ప్రవేశించడానికి అనుమతి కోరుతాడో అతడ్ని మీరు అనుతించకండి. (ఎందుకంటే అతడు సున్నత్‌కు వ్యతిరేకమైన పని చేశాడు).

5. అనుమతి కోరేవారు అనుచితమైన పదాలు ఉపయోగించరాదు. అబూదావూద్ లోని ఉల్లేఖనం ప్రకారం బనీ ఆమిర్ తెగకు చెందిన ఒక వ్యక్తి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి ఇంట్లోకి ప్రవేశించడానికి అనుమతి కోరుతూ "అ అలుజ్జు" (నేను దూరిపోనా?) అని అన్నాడు. దానికి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు తమ సేవకుడిని పిలిచి "ఈ వ్యక్తికి అనుమతి కోరే విధానము తెలియదేమో, నీవు వెళ్ళి అతడికి నేర్పించు "అస్సలాము అలైకుమ్ అ అదుఖులు" (ముందు సలామ్ చేసి ఆ తరువాత నేను లోపలికి ప్రవేశించవచ్చా?) అని అడగాలి అని. ఈ మాటలు అతడు బయట నుండే విని అదే విధంగా అనుమతి కోరగా ప్రవక్త వారు అనుమతించారు.

6. అనుమతి కోరేటప్పుడు తమ పూర్తి వివరాలు తెలపాలి. హజ్రత్ ఉమర్ రజియల్లాహు అన్హు వారు ఇలా అనేవారు "అస్సలాము అలా రసూలిల్లాహ్, అస్సలాము అలైకుమ్ అ యద్ఖులు ఉమర్" ప్రవక్త గారికి, ఇంట్లో వారికి సలామ్. ఉ మర్ కి ప్రవేశించే అనుమతి ఉందా?" అలాగే అబూ మూసా అష్అరీ వారు ఇలా అనే వారు "అస్సలాము అలైకుమ్. హాజా అబూ మూసా అస్సలాము అలైకుమ్ హాజా అష్అరీ" అస్ సలాము అలైకుమ్ నేను అబూ మూసాని ..... అస్ సలామ్ అలైకుమ్ నేను అష్అర్ ప్రాంతానికి చెందిన వాడ్ని.

7. తమ వివరాలు తెలుపకుండా అనుమతి కోరడం లేదా వివరాలు అడినప్పుడు "నేను" అనడము సముచితము కాదు. అలీ ఇబ్నె ఆసిమ్ హజ్రత్ ముగైరహ్ ను కలడానికి వెళ్ళి తలుపుతట్టారు. ఎవరు? అని ప్రశ్నించగా నేను అని సమాధానమిచ్చారు. నాకు తెలిసిన వారిలో నేను అనేవాడు ఎవ్వడూ లేడే అంటూ వారు బయటికి వచ్చి వారికి ఈ హదీసు తెలిపారు. ఒకసారి జాబిర్ ఇబ్నె అబ్దుల్లాహ్ రజియల్లాహు అన్హు వారు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి తలుపు తట్టారు. ఎవరు? అని అడగ్గా 'అన' అనగా నేను అని పలికారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు వారిని మందలిస్తూ "అన" అన" అనగా "నేను నేను" అని అంటే ఎవరో ఎలా అర్థమవుతుంది.?

ఇస్తీజాన్‌కు సంబంధించి మరిన్ని వివరాలు హదీసు గ్రంథాలలో చూడగలరు.

వినయ వినమ్రతలు – గర్వాహంకారాలు

వినయ వినమ్రతలు ఓ రకమైన ప్రత్యేకతను కలిగి ఉన్న సుగుణాలు. పవిత్ర ఖుర్ఆన్ వీటికి ప్రత్యేక ప్రాముఖ్యతనిచ్చి, ఈ సుగుణాలను అలవరచుకోవాలని ప్రోత్సహించింది. ఎందుకంటే, మానవుడు స్వతహాగా దాసుడు. అతని ఆచరణలో దాస్యం, వినయం, అణకువ, దీనత్వం వగైరాలు ఉట్టిపడాలి. ఇదే మానవుడి ఔన్నత్యం. దాస్యం, వినయ వినమ్రతలన్నవి దాస్యానికి ప్రతిబింబాలు.

గర్వం, అహంకారం, తలబిరుసుతనం వీటికి భిన్నమైనవి. అందుకని ఇవి దాస్యపు& ఔన్నత్యానికి పూర్తిగా వ్యతిరేకం.

హజ్రత్ అయాజ్ రజియల్లాహు అన్హు గారి ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఇలా సెలవిచ్చారు: "అల్లాహ్ తఆలా నా వైపునకు వహీ పంపి, వినయ వినమ్రతల వైఖరి అవలంభించమని ఆదేశించాడు. దీని ఫలితంగా ఎవరూ ఎవరిపై దౌర్జన్యానికి పాల్పడరాదు. ఎవరూ ఎవరిపై గర్వించకూడదు.

(అబూదావూద్)

ఒకరోజు హజ్రత్ ఉమర్ ఫారూఖ్ రజియల్లాహు అన్హు గారు వేదికనెక్కి ఇలా ప్రసంగించారు: "ప్రజలారా ! వినయాన్ని, వినమ్రతను అవలంబించండి. ఎందుకంటే, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఇలా ఉపదేశిస్తుండగా నేను విన్నాను. 'ఎవరైతే అల్లాహ్ కోసం (అంటే దైవాదేశంగా భావించి, ఆయన ప్రసన్నత పొందడం కోసం) వినయ వినమ్రతల వైఖరిని అవలంభిస్తాడో, (అంటే దైవదాసుల ముందు తనను తాను గొప్పవాడిగా భావించక, వినయం కలిగి ఉంటాడో) అతడికి అల్లాహ్ 'ఔన్నత్యాన్ని' ప్రసాదిస్తాడు.

దీని ఫలితంగా అతడు తన దృష్టిలో తాను చిన్నవాడిగా కనిపించినా, ఇతర దైవదాసుల దృష్టిలో అతడు చాలా ఉన్నతుడవ్వతాడు. మరెవరైతే గర్వం, అహంకారాల వైఖరిని అవలంబిస్తాడో, అతడ్ని అల్లాహ్ అల్పుడుగా చేస్తాడు.

దీని ఫలితంగా ప్రజల దృష్టిలో అతడు నీచుడుగా, హీనుడుగా అగుపడతాడు. ఒకవేళ అతను తనను తాను గొప్పవాడిగా భావించుకున్నప్పటికీ, ఇతరుల దృష్టిలో మాత్రం కుక్కలు, పందుల కంటే హీనంగా పరిగణించబడతాడు. అతనికెలాంటి విలువా ఉండదు".

(బైహఖీ)

మహాప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఇలా సెలవిచ్చారని, హజ్రత్ హారిసా బిన్ వహబ్ రజియల్లాహు అన్హు గారు తెలిపారు:

"స్వర్గవాసి ఎవరో నేను మీకు తెలుపనా?

అశక్తుడు, బలహీనులవంటి వైఖరి అవలంభించే ప్రతివాడు స్వర్గవాసే. (ప్రజల పట్ల వ్యవహారంలో గర్వం, కాఠిన్యవైఖరి అవలంభించని కారణంగా) ప్రజలు అతడ్ని చేతగాని వాడిగా భావిస్తారు. (అల్లాహ్‌తో అతని సంబంధం ఎలా ఉంటుందంటే) ఒకవేళ అతను అల్లాహ్‌పై ఒట్టేసుకున్నట్లయితే, అల్లాహ్ అతని ఒట్టును నెరవేర్చి చూపుతాడు.

మరి నరకవాసి ఎవరో కూడా నేను మీకు తెలుపనా? గర్విష్టి, దుర్మార్గుడు, అహంకారి అయిన ప్రతి ఒక్కడూ నరకవాసే".

(బుఖారీ, ముస్లిం)

సంగ్రహణం:

ఈ హదీసులో 'అశక్తత', 'బలహీనత' స్వర్గవాసి లక్షణమని చెప్పబడింది. అయితే ఇది దారుఢ్యం, బలం, శక్తికి వ్యతిరేకంగా వాడబడే అశక్తత, నిస్సహాయత అర్థంలో వాడే పదం కాదక్కడ. ఎందుకంటే, ఇలాంటి బలహీనత, అశక్తతలు ఆ పదాలకు సరిపడనిది. అలాంటి వాటిని గురించి ప్రశంసించే స్థాయి ఆ పదాలకు లేదు. పైగా ఒక హదీసులో "అల్ ముఅ్‌మినుల్ ఖవియ్యు ఖైరున్ వ అహబ్బు ఇలల్లాహి తఆలా మినల్ ముఅ్‌మిజ్ జయీఫ్" అని చెప్పబడి ఉంది. అంటే బలశాలి అయిన విశ్వాసి అల్లాహ్ దృష్టిలో బలహీన విశ్వాసి కంటే ఎక్కువ ప్రీతిపాత్రుడు" అని అర్థం. ఈ విషయం హదీసు అనువాదంలోనే విపులీకరించే ప్రయత్నం జరిగింది.

ఇక్కడ బలహీనుడు, అశక్తుడు అంటే, నమ్రత, సహృదయత, సౌమ్యస్వభావం కల వ్యక్తి అని అర్థం చేసుకోవాలి. వ్యవహారాల్లో సౌమ్యంగా ఉండడం వల్ల ఇలాంటి వ్యక్తిని ప్రజలు బలహీనుడని భావిస్తారు. అతణ్ణి అణచడానికి చూస్తారు.

అందుకే ఈ హదీసులో 'జయీఫ్' మరియు 'ముతజయ్యిఫ్' (అంటే అశక్తుడు, బలహీనుడు) అనే పదాలకు వ్యతిరేకంగా 'ఉతుల్', 'జవ్వాజ్', ముస్తక్‌నిర్' అన్న పదాలు వడబడ్డాయి. మొత్తంమీద ఈ హదీసు సారాంశం ఏమిటంటే, అశక్తత, సౌమ్యస్వభావం, నమ్రత స్వర్గవాసి లక్షణాలు. గర్వం, అహంకారం, తలబిరుసుతనం నరకవాసి లక్షణాలు.

హదీసు చివరిలో, ఇలాంటి సుగుణాలు కల వ్యక్తి అల్లాహ్‌పై ఒట్టేసి ఏదైనా పలికితే, అల్లాహ్ దాన్ని పూర్తి చేస్తాడని చెప్పడం జరిగింది. అంటే, దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఉద్దేశం సూచనప్రాయంగా ఈ క్రింది విషయాన్ని చెప్పడం కావచ్చు:

'ఒక దాసుడు అల్లాహ్ కోసం తన అస్తిత్వాన్ని చెరిపేసి ఇతర అల్లాహ్ దాసులతో వినయవిధేయతల వైఖరి అవలంబిస్తే అల్లాహ్ దృష్టిలో అతడు అందరికంటే ఎక్కువ ప్రీతిపాత్రుడవుతాడు. ఒకవేళ అతడు ఒట్టేసి ఫలానా విషయం ఇలా జరుగుతుంది అని అంటే అల్లాహ్ అతని మాటకు విలువనిచ్చి దాన్ని పూర్తి చేస్తాడు. లేక, ఇలాంటి దాసుడు ఏదైనా ప్రత్యేక వ్యవహారంలో దైవం పై ఒట్టేసి ప్రత్యేక ప్రార్థనలు (దువా) సలిపినట్లయితే అల్లాహ్ అతని దుఆను తప్పకుండా స్వీకరిస్తాడు.

ఎవరి మనసులో రవ్వంత గర్వం ఉన్నా అతడు స్వర్గంలోకి పోలేడు అని దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు సెలవిచ్చారు. ఈ ప్రవచనాన్ని హాజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్నె మస్‌ఊద్ రజియల్లాహు వారు ఉల్లేఖించారు.

(బుఖారీ; ముస్లిం)

సంగ్రహణం:

ఘనత, గౌరవం, గొప్పదనం కేవలం అల్లాహ్ హక్కు మాత్రమే. సమస్త ప్రాణుల జీవన్మరణాలు. గౌరవాగౌరవాలు ఆయన గుపిట్లోనే ఉన్నాయి.

ఆయన తప్ప అన్నీ నాశనమయ్యేవే. పవిత్ర ఖుర్ఆన్‌లో ఇలా ఉంది:

"వలహుల్ కిబ్రియాఉ ఫిస్సమావాతి వల్ అర్ది వహువల్ అజీజుల్ హకీమ్"

భూమ్యాకాశాలలో ఘనత, ఔన్నత్యం ఆయనకే శోభిస్తాయి. ఆయన అపార శక్తిమంతుడు, అసామాన్య వివేకవంతుడు.

(జాసియా: 37)

ఇక, దురహంకారి అయిన మానవుడెవరైనా ఘనత, గొప్పతనమంతా నాదేనని విర్రవీగుతూ, ఇతర దైవదాసుల పట్ల గర్వం, పొగరుబోతుతనం, తలబిరుసుతనంతో వ్యవహరించినట్లయితే, అతడు తన నిజస్థానాన్ని మరిచిపోయి దైవంతో పోటీ పడినవాడు అవుతాడు. ఈ కారణంగా అతడు తీవ్రమైన నేరం చేసిన దోషి అనబడతాడు. ఈ విధమైన ఫిరౌన్ లక్షణం కలిగిన అహంకారి స్వర్గంలోకి పోలేడని ఈ హదీసులో దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ సెలవిచ్చారు.

కొన్ని హదీసుల్లో, దుష్కర్మలు, దుష్ప్రవర్తనలకు పాల్పడిన వారు స్వర్గంలోకి పోలేరన్న మౌలిక విషయాన్ని ఇంతకు ముందే విశదీకరించడం జరిగింది. అంటే, మనిషి దురాచరణ, దుష్ప్రవర్తనలు, వాటి దుష్ప్రభావాల ఫలితంగా అతనిని స్వర్గానికి పోకుండాచేసి, నరకం వైపుకు గొనిపోతాయన్నమాట.

లేదా ఈ హదీసుకు మరో భావం, వీటికి పాల్పడినవారు, నిజమైన విశ్వాసులకు లాగా నేరుగా స్వర్గంలోకి పోకుండా, నరక శిక్షను అనుభవించవలసి ఉంటుంది.

అక్కడ నరకాగ్నిలో కాల్చి అతడి గర్వం, అహంకారమనే మాలిన్యాన్ని కాల్చి శుద్ధిపర్చడం జరుగుతుంది. ఆ పిదప అతడు విశ్వాసిగా తేలితే స్వర్గంలోకి వెళ్ళగలుగుతాడు.

హజ్రత్ అబూ హురైరహ్ రజియల్లాహు అన్హు వారి ఉల్లేఖనం ప్రకారం, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఇలా సెలవిచ్చారు:

"మూడు రకాల మనుషులతో అల్లాహ్ ప్రళయదినాన మాట్లాడడు, వారిని పరిశుద్ధపర్చడు. మరో హదీసులో వారివైపు కన్నెత్తి కూడా చూడడు అని ఉంది. వారికోసం పరలోకంలో భయంకరమైన శిక్ష ఉంది. (వారెవరంటే) 1. వృద్ధ వ్యభిచారి, 2. అసత్య పాలకుడు, 3. గర్వాన్ని ప్రదర్శించే నిరుపేద.

(ముస్లిం)

సంగ్రహణం:

కొన్ని పాపాలు స్వతహాగా మహాపాపాలుగా పరిగణించబడతాయి. కాని కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో, కొందరు ప్రత్యేక వ్యక్తుల వల్ల అవి జరిగితే, ఆ పాపాల తీవ్రత మరింత పెరిగిపోతుంది. ఉదాహరణకు, దొంగతనం స్వతహాగా ఒక నేరం మరియు పాపం. కాని దొంగతానానికి పాల్పడినవాడు సంపన్నుడైనట్లయితే, అతనికి దొంగతనం చేసే అవసరమే లేదు. ఓ ప్రభుత్వ ఉద్యోగి, లేక పోలీసు అధికారి అయిన్నాయితే, అలాంటి వాడు దొంగతనం చేయడం తీవ్రమైన పెద్ద నేరం అవుతుంది. అతడు ఎట్టి పరిస్థితిలోనూ క్షమాభిక్షకు అర్హుడు కాదు.

ఈ కోవకు చెందిన ముగ్గురు దౌర్భాగ్యులతో ప్రళయదినాన అల్లాహ్ మాట్లాడడని, వారిని పరిశుద్ధపరచడని, వారివైపు కన్నెత్తైనా చూడడని ఈ హదీసులో ప్రకటించడం జరిగింది. వృద్ధాప్యంలో వ్యభిచారం చేసేవాడు, అసత్య అధికారి, పాలకుడు, పేదరికం అనుభవిస్తున్నప్పటికీ అహంకారాన్ని, గర్వాన్ని

వీడనివాడు, ఈ మూడు రకాల మనుషులు ఈ కోవలోకి వస్తారు.

ఇలా ఎందుకంటే, ఒకవేళ ఎవరైనా ఎవ్వన ప్రాయంలో వ్యభిచారానికి పాల్పడితే, అది పెద్ద నేరం, పాపం అయినప్పటికీ అతడు షమాపణకు, మన్నింపుకు అర్హుడు కావచ్చు. ఎందుకంటే, యవ్వనంలో కామోద్రేక ప్రభావానికి లోనుకావడం స్వాభావికమైన మానవ సహజ బలహీనత. కాని ఒక వయోవృద్ధుడు తన వృద్ధాప్య దశలో ఈ చర్యకు పాల్పడితే, అది అతని స్వభావంలోనే వేళ్ళూనుకొని ఉన్న చెడు అని భావించాలి.

ఇదే విధంగా ఒక సాధారణ వ్యక్తి తన అవసరం తీర్చుకోవడానికి ఏదో ఒక అబద్ధమాడినట్లయితే, ఇది కూడా పాపమైనప్పటికీ, మన్నింపుకు అర్హుడు కావచ్చు. కాని, ఒక అధికారి, పాలకుడు కూడా అబద్ధమాడుతున్నాడు అంటే, ఇది అతని నైజంలో దాగిన తీవ్రమైన మాలిన్యానికి, దైవభీతి రాహిత్యానికి అద్దం పడుతుంది.

ఇదే విధంగా ఒక సంపన్నుడు, ముప్పూటలా మొక్కే ఐష్వర్యవంతుడు అహంకారం, దర్పం ప్రదర్శిస్తున్నాడంటే దాన్ని మనం అర్థం చేసుకోవచ్చు. అందులో ఆశ్చర్యపడాల్సిన పనిలేదు.

కాని, "మింగమెతుకు లేదుగాని మీసాలకు సంపెంగ నూనె" అన్నట్లు ఇంట్లో తిండికి కటకటలాడుతున్నా గొప్పలు పోవడం, దర్పం, అహంకారంతో ప్రవర్తించడం అతని తుచ్ఛమైన స్వభావానికి నిదర్శనం.

ఈ విధంగా ఈ మూడు రకాల దోషులు ప్రళయదినాన అల్లాహ్‌తో సంభాషించడం లాంటి మహా భాగ్యానికి, ఆయన కరుణకటాక్షాలకు, స్వయంగా ఆయన ద్వారా పునీతమయేఖీయ భాగ్యానికి నోచుకోలేకపోతారు.

చిన్నకార్యం - గొప్పఫలితం

ప్రళయదినాన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి సిఫరసుకు మీరు ఎక్కువ అర్హులు కావాలని అనుకుంటున్నారా?

అయితే

"లా ఇలాహ ఇల్లల్లాహ్"

సంకల్ప శుద్ధితో, అల్లాహ్ కొరకు జపించండి.

(బుఖారీ: కితాబుల్ ఇల్మ్)

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారికి యావత్తు ప్రపంచము కంటే ఎక్కువ ఇష్టమైన కార్యము మీరు చేయాలని అనుకుంటున్నారా?

అయితే

"సుబ్‌హానల్లాహి వలీహందు లిల్లాహి వలా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్"

చదువండి.

(ముస్లిం: కితాబుజ్జిక్ర్)

మీ సకల పాపాలు (అవి సముద్రపు నురగ అంత ఉనప్పటికీ అవి) క్షమించబడాలని అనుకుంటున్నారా?

అయితే

సుబ్‌హానల్లాహి వబిహందిహీ

రోజుకు 100 సార్లు చదువుతూ ఉండండి.

(బుఖారీ: కితాబుత్ దావాత్)

ఇస్లాంకు వ్యతిరేకంగా కుట్రల ఆరంభం

ఆదర్శమూర్తి (స)

అబూ తాలిబ్ వద్దకు వెళ్ళిన ఖురైష్ ప్రతినిధి బృందం:

ఇబ్నె ఇస్‌హాఖ్ కథనం ప్రకారం, ఖురైష్‌కు చెందిన కొందరు పెద్ద మనుషులు అబూ తాలిబ్ ఇంటికి వెళ్ళి ఆయనతో మాట్లాడారు.

"ఓ అబూ తాలిబ్ ! నీ సోదర కుమారుడు మా దేవతల్ని నిందిస్తున్నాడు. మా మతాన్ని తప్పు పడుతున్నాడు. మేమంతా మందబుద్ధిగల వాళ్ళమట. మా తాత ముత్తాతలు మార్గభ్రష్టులట. నీవ్య ఆయన్ను అలా అనకుండా వారిస్తావా లేదా మా మధ్య నుండి తప్పుకుంటావా? నీవ్య కూడా మాలాగే అతను బోధించే ధర్మానికి వ్యతిరేకమైన ధర్మాన్నే అనుసరిస్తున్నావ్య కనుక, అతణ్ణి వారించడనికి మేము చాలు" అన్నారు.

జవాబుగా అబూ తాలిబ్ వారితో సద్వర్తనతో మెలుగుతూ ఏదో నచ్చజెప్పి వెనక్కి పంపించేశారు. దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ మాత్రం తన మార్గాన్నే అనుసరిస్తూ అల్లాహ్ ధర్మాన్ని వ్యాపింపజేయడానికి సందేశాన్ని అందిస్తూనే ఉ న్నారు.

హజ్ యాత్రికులు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి మాటలను వినకుండా చేసేందుకు సలహా సంఘం ఏర్పాటు:

ఆ రొజుల్లోనే ఖురైష్‌కు మరో చిక్కు ఎదురైంది. అంటే, బాహాటంగా దైవసందేశ ప్రచారం ఆరమభమైన కొన్ని నెలలు గడిచాయో లేదో హజ్ కాలం వచ్చేసింది. అరేబియా మూల మూలల నుండి గుంపులు గుంపులుగా హజ్ యాత్రికులు మక్కాకు వస్తారన్న విషయం ఖురైషులకు బాగా తెలుసు. అందుకని ఆ హజ్ యత్రికులు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి మాటలకు ప్రభావితులు కాకుండా ఉండాలంటే, ఏదో ఒకటి వారి మనస్సుల్లో నాటాల్సి వస్తుంది. కావున వారందరూ ఈ విషయాన్ని చర్చించేందుకు 'వలీద్ బిన్ ముగైరా' ఇంట సమావేశమయ్యారు. వలీద్ ఇలా అన్నాడు: "ఈ విషయమై మీరందరూ ఒకే ఒక మాట మీద నిలబడాలి. మీలో ఎలాంటి అభిప్రాయ బేధం ఉమడడానికి వీల్లేదు. మీలోనే ఒకడు చెప్పింది మరో వ్యక్తి ఖండిమచకూడదు. చాలా జాగ్రత్తగా ఉండాల్సి ఉంటుంది." అని అన్నాడు. "కానీయండి ! ఏం చెబుతారో మీరే చెప్పండి" అని వారు వలీద్ నే అడగ్గా, "లేదు, మీరే చెప్పండి. నేను వింటాను" అన్నాడు వలీద్. దానికి కొందరు ఇలా అన్నారు: "అతను (ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్) ఓ కాహిన్ (జ్యోతిష్యుడు) అని ప్రచారం చేద్దాం". "లేదు, దైవసాక్షి ! అతను కాహిన్ కాడు. మనం చాలా మంది కాహిన్ లను చూశాం. అతనిలో కాహిన్‌లలో ఉన్న గొణుగుడు లేదు. వారిలా మాట్లాడేవాడు కాదు." అన్నాడు వలీద్.

"అలా కాకపోతే అతణ్ణి ఓ ఉన్మాదిగా చిత్రిద్దాం" అని కొందరు అనగా "అబ్బే ! అతను ఉన్మాది కూడా కాదు. మనం చాలా మంది పిచ్చివాళ్ళను, ఉన్మాదుల్ని చూశాం. వారి పరిస్థితిని కూడా గమనించిన వాళ్ళం. ఆ వ్యక్తిలో ఉన్మాదుల్లాంటి ఏ సూచనా మనకు కానరాదు. వారిలా పిచ్చిపిచ్చి ప్రేలాపనలు కూడా అతను చేయడం లేదు." అన్నాడు వలీద్.

''మరైతే అతను ఓ కవి అని వారిని నమ్మబలుకుదాం" అని వారు ఓ సలహా ఇచ్చారు. దానికి వలీద్, "అతను కవి కూడా కాదు. మనకు కవిత్వానికి సంబంధించిన ఛందస్సు సైతం బాగా తెలుసు. మొత్తానికి అతను కవి కూడా కాదు." "అతను ఓ ఇంద్రజాలికుడు అని చెబుదాం" అన్నారు అక్కడున్న వారిలో కొందరు. అతను ఇంద్రజాలికుడు కూడా కాదు. మనం ఇంద్రజాలికుల్ని, వారి జాల విద్యను కూడా చూసే ఉన్నాం. ఇతను వారిలా మంత్రాలు చదివి, త్రాళ్ళను మడులుగా వేయడం లాంటివి ఏమీ చేయడం లేదు" అన్నాడు వలీద్.

"ఇవేమీ కాకపోతే మరేమని ఆ యాత్రిక బృమదాలను నమ్మబలకగలం?" అని ప్రశ్నించారు వారు. దానికి వలీద్ కల్పించుకొని, "దైవసాక్షి ! అతని మాటలు అతి మధురమైనవి, అతని వ్రేళ్ళ పటిష్టమైనవి. దాని శాఖలు ఫలవంతమైనవి. ఆయన గురించి మీరు ఏ మాట చెప్పినా దాన్ని వారు అసత్యంగానే బావిస్తారు. అయితే, ఈ విషయంలో సరియైన మాట ఒక్కటే. అతను ఇంద్రజాలికుడు. అతను బోధించే వాణి అంతా ఇంద్రజాలమే. దాని ద్వారా తండ్రీకుమారుల్లో, అన్నదమ్ముల్లో, భార్యాభర్తల్లో, కుటుంబానికి కుటుంబానికి నడుమ చీలికలు ఏర్పడుతున్నాయి". చివరికి వారంతా ఈ సలహాను ఏకీభవిస్తూ అక్కడి నుండి వెళ్ళిపోయారు.

కొన్ని ఉల్లేఖనాల్లో, వలీద్ ఖురైష్ ప్రజలు ఇచ్చిన సలహాలన్నింటినీ త్రోసిపుచ్చగా, వారంతా నీవే మచ్చలేని సలహా ఏదైనా ఇవ్వమని అడిగారు. దానికి అతను, ''ఆగండి. నన్ను కొంత ఆలోచించుకోనివ్వండి" అని చెబుతూ దీర్ఘంగా ఆలోచించి పైన చెప్పిన సలహాను వారి ముందు ఉంచాడు.

ఈ వ్యవహారానికే సంబంధించి వలీద్ విషయంలో సూర ఎ ముద్దస్సిర్ లో పదహారు వచనాలు అవతరించాయి. వీటి లోని కొన్ని వచనాలలో అతని ఆలోచనా తీరు ఎలా ఉండెనో చెప్పడం జరిగింది. దివ్యఖుర్ఆన్‌లోని ఆ వచనాల అర్థము ఇది:

ఇన్నహూ ఫక్కర వ కద్దర్

అతను ఆలోచించి ఏదో ఎత్తు వేయడానికి ప్రయత్నించాడు.

ఫకుతిల కైఫ కద్దర్

అతడు నాశనం అవుగాక ! అతడెలాంటి ఎత్తుగడ వేయడానికి ప్రయత్నించాడు !

సుమ్మ కుతిల కైఫ కద్దర్

అతడు నాశనం అవుగాక ! అతడెలాంటి ఎత్తుగడ వేయడానికి ప్రయత్నించాడు !

సుమ్మ నజర

తరువాత (ప్రజల వైపు) చూశాడు.

సుమ్మ అబస వ బసర

ఆ తరువాత కనుబొమ్మలు ముడిచాడు. ముఖం చిట్లించుకున్నాడు.

సుమ్మ అద్బర్ వస్తక్బర

ఆపై విర్రవీగుతూ తిరిగిపోయాడు.

ఫ కాల ఇన్ హాజా ఇల్లా సిహ్రుయ్ యుఉసర్

చివరకు, ఇది పూర్వం నుండి వస్తూ ఉన్న ఒక మంత్రజాలం తప్ప మరేమీ కాదు

ఇన్ హాజా ఇల్లా కవలుల్ బషర్

ఇది ఒక మానవుని వాక్కు మాత్రమే అని అన్నాడు.

మొత్తానికి ఈ తీర్మానం జరిగాక దాన్ని అమలుచేసే పని మొదలైంది. కొందరు మక్కాకు చెందిన దైవతిరస్కారులు హజ్ యాత్రికులు వచ్చే వివిధ మార్గాల్లో కూర్చుని, ఆ మార్గాల ద్వారా ప్రయాణం చేసే హజ్ యాత్రికుల్ని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి నుండి వచ్చే ప్రమాదం గురిమచి హెచ్చరిస్తూ వివరాలనందించసాగారు. ఈ విషయంలో అబూ లహబ్ అందరికంటే చురుకుగా పాల్గొన్నాడు. అతను హజ్ కాలంలో యాత్రికుల విడుదులు మరియు ఉకాజ్, మజిన్నా, జుల్ మజాజ్ సమతల్లో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వెన్నంటి ఉండేవాడు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు దైవ ధర్మ ప్రచారం చేస్తుంటే దాన్నందుకుని అబూ లహబ్, ఈయన మాటలు వినకండి, ఈయన అసత్యవంతుడు, మార్గభ్రష్టుడైనవాడు అని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి ప్రచారాన్ని ఖండించేవాడు.

ఇలా ప్రజలు హజ్ యాత్ర పూర్తి చేసుకొని ఇళ్ళకు మళ్లేనాటికి, ముహమ్మద్ అనే ఓ వ్యక్తి తాను దైవసందేశహరునిగా చెప్పుకుమటున్నాడన్న సత్యం వారిలో తెలిసిపోయింది. హజ్ యాత్రికుల ద్వారా ఈ వార్త పూర్తి అరేబియాలో వ్యాపించిపోయింది.

దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారిని దైవప్రచారము నుండి అడ్డుకోవడానికి ఈ విధానం పనిచేయడం లేదన్నది తెలిసిపోగానే, వారంతా తిరిగి ఆలోచనలో పడిపోయారు. దైవసందేశాన్ని వ్యాపింపకుండా జేయడానికి అనేక విధానాల్ని అవలంభించ నారంభించారు. వాటి వివరాలు ఇన్షాల్లాహ్ వచ్చే సంచికలో చుద్దాం.









paighamehidayath.tk

2013 నుండి 2016 వరకు ప్రచురించబడిన సంచికలు అన్నీ మా వెబ్ సైట్ నుండి డౌన్లోడ్ చేసుకోగలరు. ఇన్షాల్లాహ్ త్వరలో 2017 సంచికలు కూడా అప్లోడ్ చేయబడును.

మీ సలహాలు, సందేహాలు, ఫిర్యాదుల కొరకు సంప్రదించండి

Editor, Paigham e Hidayath,
17-1-391/2/79/A,
Khaja Bagh Colony,
Saidabad, Hyderabad - 500059.
Phone: 9030557865

వజూ ఏ సందర్భాలలో అభిలషనీయము

ఇంతక ముందు మనం వజూ ఏ సందర్భాలలో ఫర్జ్ (అనివార్యము) అవుతుంది, ఏ సందర్భాలలో వాజిబ్ అవుతుందో వివరంగా తెలుసుకుని ఉన్నాము. ఇక నేట నంచికలో వజూ ఏ సందర్భాలలో ముస్తహబ్ అనగా అభిలషనీయము అవుతుందో తెలుసుకుందాము. ధార్మిక పండితులు ఖుర్ఆన్ మరియు ప్రామాణిక హదీసుల వెలుగులో 28 సందర్భాలలో వజూ చేయడం "ముస్తహబ్"గా పేర్కొన్నారు. అంటే ఈ 28 సందర్భాలలో వజూ చేసుకుంటే మంచిది. వజూ చేయని ఎడల ఎటువంటి పాపము ఉండదు.

1. నిద్రపోయే ముందు:

హజ్రత్ బరా ఇబ్నె ఆజిబ్ రజియల్లాహు అన్హు ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఈ విధంగా సెలవిచ్చారు: "పండుకోవాలని అనుకున్నప్పుడు నమాజు కొరకు ఎలా వజూ చేస్తావో అలా వజూ చేయి. ఆ తరువాత నీ కుడి వైపునకు తిరికి పండుకో మరియు ఈ దుఆను పఠించు: "అల్లాహుమ్మ అస్లంతు నఫ్సీ ఇలైక వ ఫవ్వజ్తు అమ్రీ ఇలైక వ అల్జఅత్తు జహ్రీ ఇలైక రహ్బతన్ వ రగ్బతన్ ఇలైక లా మల్జఅ వ లా మన్జఅ మిన్క ఇల్లా ఇలైక ఆమన్తు బికితాబికల్లజీ అన్జల్త వ బినబియ్యికల్లజీ అర్సల్త" నీవు నిద్రలోక జారుకోక ముందు ఇవే నీ చివరి పలుకులు అయ్ ఉండాలి. ఆ స్థితిలో నీవు గనక మరణిస్తే నీవు ఫిత్రత్ పై (ప్రవక్తల విధానముపై) మరణిస్తావు. (బుఖారీ; ముస్లిం)

2. గుసుల్ చేయక ముందు:

విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఆయిషా సిద్దీఖా రజియల్లాహు అన్హా వారు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు గుసుల్ చేసే విధానాన్ని తెలుపుతూ ఇలా అన్నారు: "దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు గుసుల్ చేసేటప్పుడు ముందు తమ రెండు చేతులు కడిగేవారు, ఆ తరువాత తమ కుడి చేతితో ఎడమ చేతిపై నీళ్ళు పోస్తూ తమ మర్మాంగాన్ని శుభ్రము చేసేవారు. ఆ తరువాత నమాజు కొరకు వజూ చేసినట్లు (అంటే సంపూర్ణంగా) వజూ చేసేవారు. ఆ పై చేతిలో నీళ్ళు తీసుకుని తమ తల వెంట్రుకల వ్రేళ్ళను తడిపేవారు. (అంటే ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి సిరోజాలు చాలా దట్టముగా ఉండేది. కొన్ని సందర్భాలలో వారి మెడ వరకు కూడా చేరిపోయేవి. మరి తలపై నీరు పోసుకున్నప్పుడు దట్టంగా ఉండడం వల్ల లోపలి వరకు నీళ్ళు కొన్ని సందర్భాలలో చేరకపోవచ్చు. అంచేత వారు ముందు తమ తడి వేళ్ళతో జుట్టు వ్రేళ్ళను తడిపేవారు) వ్రేళ్ళ వరకు నీరు చేరిపోయిన తరువాత వారు మూడు సార్లు తమ తలపై నీరు పోసుకునేవారు, ఆ తరువాత తమ శరీరమంతటిపై నీళ్ళు పోసుకునేవారు. ఆ తరువాత తమ కాళ్ళు కడుక్కునేవారు. (ముస్లిం)

3. జునుబీ ఏదైనా తినడానికి/త్రాగడానికి/ నిద్రించడానికి ముందు:

ఉమ్ముల్ ముఉ్మినీన్ హజ్రత్ ఆయిషా సిద్దీఖా రజియల్లాహు అన్హా గారి ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు అపరిశుభ్ర స్థితిలో ఉండగా నిద్రించాలనుకుంటే ముందు తమ మర్మాంగాన్ని శుభ్రము చేసుకుని, నమాజు కొరకు వజూ చేసే విధంగా (సంపూర్ణ) వజూ చేసుకుని నిద్రించేవారు. (బుఖారీ, ముస్లిం) ముస్లిం లోని మరో ఉల్లేఖనంలో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు అపరిశుద్ధ స్థితిలో ఏమైనా తినాలనుకుంటే కూడా ఇలాగే వజూ చేసి తినేవారు అని ఉంది.

4. నమాజు కొరకు వజూ ఉండగా మరో వజూ చేసుకోవడం:

హజ్రత్ అనస్ ఇబ్నె మాలిక్ రజియల్లాహు అన్హు వారి కథనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ప్రతీ నమాజుకు వజూ చేసే వారు.

అలాగే హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్నె ఉమర్ రజియల్లాహు అన్హు వారు ఇలా తెలిపారు: యే వ్యక్తి అయితే వజూ మీద వజూ చేస్తాడో (అనగా ఇంతక ముందు చేసిన వజూ భంగము కాకుండానే మరో సారి వజూ చేస్తాడో) అతడి కొరకు 10 పుణ్యములు లిఖించబడును. (ముసన్నఫ్ ఇబ్నె అబీ షైబహ్)

5. ఎల్లప్పుడూ వజూతో ఉండడం:

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు విడిపించిన బానిస హజ్రత్ సౌబాన్ రజియల్లాహు అన్హు వారి కథనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఇలా అన్నారు: ఎల్లప్పుడూ వజూతో ఉండడం ఒక విశ్వాసికి మాత్రమే సాధ్యం. (ముసన్నఫ్ ఇబ్నె అబీ షైబహ్)

ఈ హదీసులో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఎల్లప్పుడూ వజూతో ఉండడం విశ్వాసికే సాధ్యం అంటూ ఎల్లప్పుడూ వజూతో ఉండడం విశ్వాసి యొక్క చిహ్నం, అతడి ఓ లక్షణంగా ప్రకటించారు. కాబట్టి అదరూ సాధ్యమైనంతవరకు ఎప్పుడూ వజూతో ఉండేందుకు ప్రయత్నించాలి. వజూ భంగమైన వెంటనే వజూ చేసుకోవాలి.

6. దైవ నామస్మరణ కోసం:

హజ్రత్ ముహాజిర్ ఇబ్నె కున్ఫుజ్ రజియల్లాహు అన్హు వారి ఉల్లేఖనం ప్రకారము వారొకసారి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారు తమ కాలకృత్యాలు తీర్చుకుంటుండగా వచ్చారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారికి సలాము చేశారు. కాని ప్రవక్త గారు వజూ చేయనంత వరకు వారి సలామ్‌కు ప్రతిసలాము చేయలేదు. వజూ చేసుకున్న తరువాత వారి సలామ్‌కు జవాబు ఇచ్చి ఇలా అన్నారు: "వజూలేకుండా అల్లాహ్ నామాన్ని నా నోట పలకడం నాకు ఇష్టం లేదు అందుకే వజూ చేసి జవాబు ఇచ్చాను" అని అన్నారు. (అబూదావూద్; ఇబ్నె మాజహ్)

7. ధార్మిక విద్యను బోధించేటప్పుడు లేదా అభ్యసించేటప్పుడు:

ధార్మిక విద్యను బోధించేటప్పుడు లేదా అభ్యసించేటప్పుడు తరచూ అల్లాహ్ నామము వస్తూ ఉంటుంది. కాబట్టి వజూ స్థితిలో ఉండడం మంచిది. అలాగే హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్నె ఉమర్ రజియల్లాహు అన్హు వారు ఇలా అంటుండేవారు: సజ్దా చేయరాదు కేవలం వజూతో ఉన్నప్పుడు తప్ప. ఖుర్‌ఆన్ పారాయణం చేయరాదు కేవలం వజూతో ఉన్నప్పుడు తప్ప, జనాజా నమాజు చేయరాదు కేవలం వజూతో ఉన్నప్పుడు తప్ప.

(బైహఖీ)

హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్నె ఉమర్ రజియల్లాహు అన్హు వారి ఈ అసర్ ద్వారా కూడా మనకు ధార్మిక విధ్య (ఖుర్ఆన్, హదీస్) బోధించేటప్పుడు, అభ్యసించేటప్పుడు వజూతో ఉండడం అఖిలషనీయము అని తెలుస్తోంది.

8. అజాన్ ఇవ్వడం కొరకు:

ఇందులోనూ దైవ నామ స్మరణ ఉంటుంది కాబట్టి వజూ చేసుకోవాలి. అలాగే హజ్రత్ అబూ హురైరహ్ రజియల్లాహు అన్హు వారి ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఇలా అన్నారు: "వజూ ఉన్న వారే అజాన్ ఇవ్వాలి". (బైహఖీ)

9. అరఫాలో వుకూఫ్ కొరకు:

అరఫాలో ఉన్నప్పుడు పూర్తిగా దైవ ధ్యానము, దుఆలో నిమగ్నమై ఉంటారు. కాబట్టి వజూతో ఉండడం మంచిది. అందుకే కొందరు తాబయీన్‌లు హజ్ పద్ధతి నేర్పుతూ అరఫాలో వజూ స్థితిలో ఉండాలని ఆదేశించేవారు. ఉదాహరణకు హజ్రత్ ఇబ్రాహీమ్ ఇలా అనేవారు: జవాల్ సమయానికి అరఫా చేరుకున్నవారు సాధ్యపడితే గుసుల్ చేయండి లేదా వజూ చేసుకోండి. (ముసన్నఫ్ ఇబ్నె అబీ షైబహ్)

10. నిద్ర నుండి మేల్కొన్న తరువాత:

11. జనాజా మోసిన తరువాత:

హజ్రత్ అబూ హురైరహ్ రజియల్లాహు అన్హు వారి కథనం ప్రకారము దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఇలా ఆదేశించారు: "మయ్యిత్‌కు గుసుల్ చేయించిన వారు గుసుల్ చేసుకోవాలి, అతడ్ని మోసిన వారు వజూ చేసుకోవాలి. (అబూ దావూద్, తిర్మిజీ)

12. రెండవ సారి సంభోగించదలచినప్పుడు:

హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ రజియల్లాహు అన్హు గారి ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఇలా ఉపదేశించారు: మీలో ఎవరైనా తన భార్యతో సంభోగించిన తరువాత మళ్ళీ రెండవ సారి సంభోగించదలిస్తే ముందు వజూ చేసుకోవాలి". (ముస్లిం)

13. స్త్రీ ని తాకినప్పుడు, ముద్దాడినప్పుడు:

దివ్య ఖుర్ఆన్ వచనము "ఔ లామస్తుమున్ నిసాఅ" కు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి అనుచరులు కొంత మంది స్త్రీని తాకినప్పుడు, ముద్దాడినప్పుడు వజూ భంగమైపోతుందని విశ్లేషణ ఇచ్చారు. (హజ్రత్ ఇబ్నె ఉమర్, ఇబ్నె మస్ఊద్ మొదలగు సహాబీల నుండి ఇలాంటి ఉల్లేఖనాలు కొన్ని ముసన్నఫ్ అబ్దుర్రజ్జాఖ్ లో చూడవచ్చును) కాని ఎక్కువ శాతం విద్వాంసులు దీనికి సమ్మతించలేదు. అయినప్పటికీ భార్యను సంభోగించకుండా కేవలం ముద్దాడినట్లయితే వజూ చేసుకోవడం మంచిదని ధార్మిక విద్వాంసులు అభిప్రాయ పడ్డారు.

14. ఒంటె మాంసము తిన్న తరువాత:

హజ్రత్ బరా ఇబ్నె ఆజిబ్ రజియల్లాహు అన్హు వారి కథనం ప్రకారం "ఒంటె మాంసము తిన్న తరువాత వజూ చేయడం గురించి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారిని ప్రశ్నించగా వారు ఒంటె మాంసము తిన్నప్పుడు వజూ చేసుకోమని ఆదేశించారు. ఆ తరువాత మేక మాంసము గురించి ఆడిగితే దానికి వజూ అఖ్ఖరలేదు అని అన్నారు. (అబూదావూద్)

15. కోపము వచ్చినప్పుడు:

హజ్రత్ అతియ్యా ఇబ్నె ఉర్వా సాయిదీ రజియల్లాహు అన్హు వారి కథనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు

ఇలా ఉపదేశించారు: "కోపము షైతాన్ తరుపు నుండి వస్తుంది. షైతాన్ నిప్పుతో సృష్టించబడ్డాడు. మరి నిప్పు నీటితో ఆర్పబడుతుంది. కాబట్టి మీలో ఎవరికైనా కోపము వస్తే వజూ చేసుకోండి." (అబూదావూద్, ముస్నదే అహ్మద్)

16. అబద్ధము పలికినప్పుడు:, చాడీలు చెప్పినప్పుడు, అపనింద మోపినప్పుడు:

సలఫ్ సాలిహీన్ నోటితో ఏదైనా చెడు కార్యము చేస్తే వెంటనే వజూ చేసుకునేవారు, ఇతరులకు కూడా ఆదేశించేవారు. హజ్రత్ ఇబ్రాహీమ్ రహ్మతుల్లాహి అలైహ్ ఇలా అనేవారు: నేను వజూ భంగము కానంత వరకు లేదా నోటితో ఏదైనా చెడు పలకనంత వరకు అదే వజూతో అన్ని నమాజులు చేసుకునే వాడ్ని. (అబ్దుర్రజ్జాఖ్) అలాగే హజ్రత్ హారిస్ రహ్మతుల్లాహి అలైహ్ వారి కథనం ప్రకారము వారొక సారి హజ్రత్ ఇబ్రాహీమ్ గారి ముందు వేరొక మనిషి గురించి ప్రస్తావిస్తూ వారి గురించి చాడీలు చెప్పారు. వెంటనే హజ్రత్ ఇబ్రాహీమ్ గారు వారిని వజూ చేయమని ఆదేశించారు. (ముసన్నఫ్)

ఇందులో హిక్మత్ (మర్మము) ఏమిటంటే వజూలో ఏ అవయవాలు అయితే కడగబడతాయో వాటి నుంచి సంభవించిన (చిన్న) పాపాలు వజూ ద్వారా క్షమించబడతాయి. (ముస్లిం) అంచేత వారు నాలుకతో జరిగిన ఈ పాపము క్షమించబడడానికి పశ్చాత్తాపము చెందడంతో పాటుగా వజూ కూడా చేసుకునేవారు.

17. సఫా - మర్వా మధ్య సయీ చేసేటప్పుడు

18. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి సమాధిని దర్శించి సలామ్ చేసేటప్పుడు.

గౌరవనీయులైన పాఠకులారా !

మీ వద్దకు క్రమం తప్పకుండా పైగామ్ ఎ హిదాయత్ మాసపత్రిక పంపబడుతోంది. 90 శాతం మంది బకాయిలు చెల్లించ వలసియున్నది. కాబట్టి వాటిని చెల్లించవలసిందిగా మనవి చేసుకుం టున్నాము. మీ మెంబర్‌షిప్ వివరాలు కవర్ పై అతికించిన మీ అడ్రస్ పై లైన్‌లో ఉంటాయి. మొదటి లైన్‌లో మీరు ఎప్పటి వరకు డబ్బులు చెల్లించారు, ఆ తరువాత మీ మెంబర్‌షిప్ నెంబర్, ఆ తరువాత మీ పూర్తి అడ్రస్ ఉంటుంది. దయచేసి మీరు గనక బకాయీ చెల్లించాల్సి ఉంటే వెంటనే మా అడ్రస్‌కు మనిఆడర్ లేదా మా బ్యాంక్ అకౌంట్‌లో డిపాజిట్ చేయగలరు. అలాగే ఎం.వో ద్వారా చందా పంపే పాఠకులు తమ ఇంటి నెంబరు, పోస్టాఫీసు పిన్‌కోడ్ నెంబరు తదితర పూర్తి వివరాలు తమ చిరునామాలో తెలియపరచ వలెను. అలాగే మాకు చందా అందిన వెంటనే మీరిచ్చిన చిరునామాకు పత్రికను తప్పక పంపిస్తాము. అనుకోని కారణాల వల్ల మీకు పత్రిక అందనట్లయితే మాకు తప్పక తెలియజేయగలరు.

మీ సంవత్సరపు చందా మా బ్యాంక్ అకౌంట్‌లో జమచేయగలరు...
మా

బ్యాంక్ ఎకౌంట్ వివరాలు

Ac. no:035210011034204
MOHD ABDUL QAVI,
ANDHRA BANK,
MALAKPET BRANCH
IFSC Code: ANDB0000352

షిర్క్

ఓ క్షమించరాని నేరం

ప్రత్యేక వ్యాసం

పాపాలన్నిటిలో కల్లా పెద్ద పాపము "షిర్క్" అనగా అల్లాహ్‌కు ఇతరులను సాటి కల్పించడం. ఇది రెండు రకాలు. ఒకటి "అల్లాహ్‌కు ఇతరులను సాటి కల్పించడం మరియు అల్లాహ్‌ను వీడి చెట్టు, పుట్ట, రాయి, రప్ప మొదలగు సృష్టితాలను ఆరాధించడం. ఇదే షిర్కే అక్బర్. దీని గురించే అల్లాహ్ తఆలా దివ్య ఖుర్‌ఆన్‌లో ఈ విధంగా తెలిపాడు:

ఇన్నల్లాహ లా యగ్‌ఫిరు అయ్ యుష్‌రక బిహీ వ యగ్‌ఫిరు మాదూన జాలిక లిమయ్ యషా

నిష్చయంగా అల్లాహ్ అతనితో ఇతరులను సాటికల్పించడాన్ని అస్సలు క్షమించడు. ఇక దాన్ని తప్ప ఇక ఏ పాపమైనా తాను తలుచుకున్న వారికి క్షమిస్తాడు.

మరో చోట ఈ విధంగా తెలిపాడు:

ఇన్నషి షిర్క లజుల్‌మున్ అజీమ్

నిష్చయంగా షిర్క్ చాలా ఘోర అపరాధము.

మరో వచనములో అల్లాహ్ తఆలా ఈ విధంగా తెలుపుతున్నాడు:

ఇన్నహూ మై యుష్‌రిక్ బిల్లాహి ఫకద్ హర్రమల్లాహు అలైహిల్ జన్నహ వ మతీవాహున్ నార్

అల్లాహ్ తో ఇతరులను సాటికల్పించే వారి కొరకు అల్లాహ్ స్వర్గాన్ని నిషేధించాడు. ఇక నరకమే అతడి (స్యాశ్వత) నివాసము.

షిర్క్ కు సంబంధించి దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలాంటి వచానాలు ఎన్నో ఉన్నాయి. ఏ వ్యక్తి అయితే అల్లాహ్‌కు ఇతరులను సాటికల్పిస్తాడో, దైవేతరులను ఆరాధిస్తాడో చివరికి అదే స్థితిలో మరణిస్తాడో అతడు ఇక నరకానికే వెళతాడు. ఇందులో ఎటువంటి సందేహము లేదు. ఎలాగైతే ఒక విశ్వాసి అల్లాహ్‌ను విశ్వసిస్తూ జీవితం గడిపి, విశ్వాస స్థితిలోనే మరణిస్తే అతడు (తాను చేసుకున్న పాపాలకు శిక్షను అనుభవించిన తరువాతనైనా సరే) ఖచ్చితంగా స్వర్గానికి వెళతాడు అని చెప్పడంలో ఎటువంటి సందేహము లేదో అలాగే ఒక ముష్రిక్ అనగా అల్లాహ్‌తో పాటు ఇతరులను కొలిచేవాడు, ఆరాధించేవాడు ఖచ్చితంగా నరకానికి వెళతాడు, ఇక అక్కడే శాస్వతంగా శిక్షను అనుభవిస్తూ ఉంటాడు.

ఒక ప్రామాణికమైన హదీసులో ఇలా ఉంది, దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు తమ అనుచరులనుద్దేశించి మూడు సార్లు ఇలా ప్రశ్నించారు:

"మీకు పాపాలలోకల్ల అతిపెద్ద పాపాలు ఏమిటో తెలుపనా?" దానికి వారి అనుచరులు "ఓ దైవ ప్రవక్తా! తప్పక తెలుపండి అని అన్నారు. అప్పుడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు "అల్లాహ్‌కు సాటి కల్పించడం (దైవేతర ఆరాధనకు పాల్పడడం), తల్లిదండ్రులకు

అవిధేయత చూపడం (ఆ సమయంలో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఆనుకొని కూర్చుని ఉన్నారు. కాన్ని ఒక్కసారిగా లేచి) గుర్తించుకోండి ! అబద్ధము పలుకడం, అబద్ధ సాక్ష్యమివ్వడం అని అన్నారు. ఈ మాటను వారు పదే పదే చెబుతూనే ఉన్నారు. చివరకు మేము వారిక చెప్పడం ఆపితే బాగుండు అని భావించాము.

అలాగే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఇలా ప్రవచించారు:

''పతనానికి గురిచేసే ఏడిటి నుండి జాగ్రత్తపడండి. ఆ ఏడిటిలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు షిర్క్‌ను కూడా పేర్కొన్నారు. (మిగతా ఆరు విషయాలు: 1. చేతబడి; 2. హత్య; 3. అనాధల సొమ్ము కబళించడం; 4. వడ్డీ తీసుకోవడం; 5. యుద్ధమైదానము నుండి పారిపోవడం; 6. సాశీల్యవతులైన స్త్రీలపై ఆభాండాలు మోపడం.)

షిర్క్ యొక్క రెండవ రకము: ''అర్ రియా వస్ సుముఅహ్" :

అనగా ప్రదర్శనా బుద్ధి. అల్లాహ్ తఆలా ఇలా ఉపదేశించారు:

ఫమన్ కాన యర్జూ లికాఅ రబ్బిహీ ఫల్ యఅమల్ అమలన్ సాలిహా వలా యుషిరిక్

బి-ఇబాదతి రబ్బిహీ అహదా

కనుక తన ప్రభువును కలుసుకోవాలన్న ఆకాంక్ష ఉన్నవాడు సత్కార్యాలు చేయాలి. తన ప్రభువు ఆరాధనలో వేరొకరికి భాగస్వామ్యం కల్పించకూడదు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఇలా ఉపదేశించారు:

"షిర్క్ అస్గర్" నుండి దూరంగా ఉండండి. వారి సహచరులు షిర్క్ అస్గర్ అంటే ఏమిటి? అని ప్రశ్నించగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ''ప్రదర్శనాబుద్ధి'' అని సెలవిచ్చారు. ఏ రోజునయితే అల్లాహ్ తఆలా తన దాసులకు తమ ఖర్మల ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాడో ఆ రోజు అల్లాహ్ "రియాకార్" అనగా ప్రదర్శనా బుద్ధి కలిగిన వారితో ఇలా అంటాడు: ఎవరికి చూపించడానికైతే మీరు ఈ ఖర్మలు చేశారో వారి వద్దకు వెళ్ళండి. బహుశా అక్కడైనా మీకు ప్రతిఫలం దక్కుతుందేమో.

అలాగే మరో సందర్భమున దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఇలా సెలవిచ్చారు:

"అల్లాహ్ తఆలా ఇలా అంటున్నాడు "ఏ వ్యక్తి అయితే ఒక సత్కర్మను చేసి అందులో నాతో పాటు ఇతరులను కూడా చేర్చుతాడో ఆ కార్యము ఆ చేర్చబడినవారి కొరకుచేసినదే. దానికి, నాకు ఎలాంటి సంబంధము లేదు.

అనగా నేను దాన్ని స్వీకరించను, దానికి ఎటువంటి ప్రతిఫలమూ ఇవ్వను.

హజ్రత్ అబూ హురైరహ్ రజియల్లాహు అన్హు వారి ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఇలా ఉపదేశించారు: "ఎంతో మంది ఉపవాసము పాటించు వారికి ఆకలి దప్పికలు తప్ప ఏ మీ లభించదు. చాలా మంది జాగారము చేసేవారికి మెలుకువగా ఉండడం తప్ప ఇంకేమీ లభించదు." అనగా ఆ ఆరాధనలు (నమాజు; ఉపవాసము) అల్లాహ్ కొరకు ఆచరించనివి కానేకావ్య. కాబట్టి వాటికి ఎటువంటి ప్రతిఫలము అనేది ఉండదు. మరి ప్రతిఫలమే లభించనప్పుడు ఆ ఉపవాసాలు, జాగారాల వల్ల ఆకలి దప్పికలతో

అలమటించడం, కమ్మటి నిద్రకు దూరం కావడం తప్ప ఇంకేం లభించినట్టు?

మరో ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఇలా సెలవిచ్చారు:

ప్రదర్శనాబుద్ధితో సత్కార్యాలు చేసే వాడి ఉపమానము మట్టితో సంచి నింపుకుని బజారుకు వెళ్ళే వాడి లాంటిది. అతడు బజారుకు వెళ్ళి కొనుగోలు చేసిన పిమ్మట మట్టితో నిండివున్న తన సంచిని ఎజమాని ముందు వ్యంచితే ఆ యజమాని మా మట్టిని అతడి ముఖాన్నే కొడతాడు. అలాగే ప్రదర్శనాబుద్ధితో సత్కార్యాలు చేసివాడికి పరలోకములో ఎటువంటి ప్రతిఫలము ఉండదు.

అల్లాహ్ తఆలా ఇలా సెలవిస్తున్నారు:

వ కదిమ్నా ఇలా మా అమిలూ మిన్ అమల్ ఫజఅల్నాహు హబాఅమ్ మన్సూరా

వారు ఏవైతే కర్మలు చేశారో (వారి ప్రదర్శనాబుద్ధి కారణంగా) వాటిని మేము ఎగిరిన దుమ్ము ధూళివలే చేసేశాము.

అనగా ఏ కర్మలైతే వారు మా కొరకు చేయలేదో మేము వాటి ప్రతిఫలాన్ని తీసివేసాము. మరియు వాటిని హబాఅమ్ మన్సూర్ (అనగా సూర్యుడి కిరణాలలో కనబడే మట్టితునకలుగా) చేసేశాము.

మీరు చాలా సార్లు చూసే ఉంటారు, మూసివున్న గదిలో ఒక చిన్ని రంద్రము గుండా లోపలికి వచ్చే కిరణాలలో చాలా చిన్నపాటి కణాలు ఎగురుతూ ఉంటాయి. అవి ఎంత అల్పమైనవంటే తలుపు తెరిస్తే చాలా అవి అక్కడే ఉన్నప్పటికీ కంటికి అసలు కానరావు. నిజానికి ఈ చిన్నపాటి మట్టితునకలనే "హబాఅమ్ మన్సూరా" అంటారు. సుబ్హానల్లాహ్ ! ప్రదర్శనాబుద్ధి గలవారి కర్మలను వీటితో పోల్చడంలో ఎంతటి బలాగత్ ఉంది, మరియు వాటి మధ్య ఎలాంటి పోలిక ఉంది. వారి కర్మలు చూడడానికి కర్మలే అయినప్పటికీ అవి అంగీకారయోగ్యము కానప్పుడు, వాటిపై ఎలాంటి పుణ్యము, సామిప్యము లభించనప్పుడు అవి ఉన్నా లేనట్టే. ఎంతో భయపడవలసిన విషయమిది. అల్లాహ్ తఆలా అందరికీ ఇఖ్లాస్ ప్రసాదించుగాక.

ఒక హదీసు ప్రకారము ఒక వ్యక్తి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారిని ఈ విధంగా ప్రశ్నించాడు:

